క్లుప్తంగా

కొదలమడుగులో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు


శ్రీకృష్ణ భగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు గ్రామంలో సోమవారం శ్రీకృష్ణభగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగాంగా ఉదయం గ్రామానికి చెందిన ప్రబోదానంద భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం కృష్ణుడి ప్రతిమను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల మీదుగా మేళ తాళాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనల నడుమ కొలాహలంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 20 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 48 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రాంతీయ జీవిత చిత్రణలో డాక్టరేట్


గీత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన కె.గీతకి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కుప్పం ద్రావిడ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.పి.నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు. తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.తిరుపతి పరిశోధన పర్యవేక్షణలో రాయలసీమ కథలు–ప్రాంతీయ జీవిత చిత్రణ (1991–2000) అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ అందజేశారు. ద్రవిడ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డు పొందిన గీతను పలువురు అభినందించారు.

జ్వరంతో తల్లడిల్లి...

చిత్తూరు రూరల్: జ్వరంతో తల్లడిల్లిన వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయిన సంఘటన చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం వెలుగుచూసింది. నగరంలోని సంతపేటకు చెందిన ప్రసాద్(42) మూడు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స చేసిన వైద్యులు 105 డిగ్రీల జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. అయితే వైద్య సేవల్లో జాప్యం కావడంతో ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఎం.ఎస్‌వార్డులో గొడవకు దిగారు. వెంటనే ఆ వ్యక్తిని తిరుపతికి రెఫర్ చేయించుకున్నారు. అయితే ఈ విషయం అపోలో ఏడీ రాంగోపాల్‌రెడ్డికి తెలియడంతో వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిత్తూరు: కొర్పొరేటర్ హరిణిరెడ్డి ఆధ్వర్యంలో ఫ్యాన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, ఆటో డ్రైవర్‌కు కొత్త దుస్తులు అందజేస్తున్న విజయానందరెడ్డి




మిథునన్న జన్మదినం.. సేవా సంబరం


బంగారుపాళెం: అన్నదానం చేస్తున్న పూతలపట్టుఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించారు. జగనన్న కాలనీలో ఇళ్లు కట్టుకున్న 50 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్ హరిణి రెడ్డి సౌజన్యంతో 50 సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. గిరింపేట సర్కిల్‌లో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఎంఎస్ఆర్ సర్కిల్లో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్ ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు. పాతకోర్టు వద్ద మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ అన్నదానం చేసి, క్రికెట్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని అరుల్‌పురం సమీపంలోని పాల్స్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వద్ద చైర్మన్ యోగలత, హ్యాండ్స్ అండ్ మిషన్ స్కూల్ చైర్మన్ పన్నీరుసెల్వం కలిసి 300 మంది పిల్లలకు స్కూల్ బ్యాగులను, 500 మందికి చీరలను పంపిణీ చేశారు.

యాదమరి: మండల కేంద్రంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ కలిసి పార్టీ కార్యాలయం ముందు కేక్ కట్ చేశారు.

బంగారుపాళెం: మండల కేంద్రంలో మిథున్ యువసేన జిల్లా అధ్యక్షుడు కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు.

తవణంపల్లి: మండలంలోని ఐరాల క్రాస్ రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపంలో పార్టీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఐరాల: మండల కేంద్రంలో పార్టీ కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నగరంలోని చేపల మార్కెట్ వద్ద వైఎస్సార్‌సీపీ యువనాయకులు మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు.

ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ

చిత్తూరు రూరల్: ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ మైదానంలో ఆటోనేస్తం పేరుతో విజయానందరెడ్డి పెద్ద ఎత్తున సేవ కార్యక్రమం నిర్వహించారు. మూడు వేల మంది ఆటోడ్రైవర్లకు ఖాకీదుస్తులు, కుట్టు కూలీను అందజేశారు.


చిత్తూరు: పాతకోర్టు వద్ద జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్


చిత్తూరు ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం


గుడిపాల: పిల్లలకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న యోగలత

అద్దాల మండపం సందర్శించిన ఎమ్మెల్యే


మండపాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రధాన ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సోమవారం సందర్శించారు. ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదినం సందర్భంగా కిషోర్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఐరాల మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి, పుణ్యసముద్రం రవి, ఆలయ అధికారులు ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటిండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన


సమస్యలు వింటున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ వారం వచ్చే ఫిర్యాదులపై స్థితిగతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించి, నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్


గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని పాలకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

197రామాపురంలో వైద్యసేవలు

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి అనూష 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శాంతకుమారి, సరస్వతి, దివ్య, శిల్ప, శౌలు పాల్గొన్నారు.

వేద గణితంపై విద్యార్థులకు శిక్షణ


ప్రసాదరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు వేదగణితం ఉపయోగపడుతుందని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అన్నారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వేదగణితంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు గణితంపై పట్టు సాధించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన వేదిక్ గురువు ఆర్ వీవీ ప్రసాదరావు వేదగణితం ఉపయోగాలు, లాభాలను వివరించారు. సంకలన, గుణకారాల్లో సూక్ష్మ పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గణితంలో పట్టు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక విద్యా విభాగం జిల్లా కన్వీనర్, గణితావధాని అరుణ్‌శివప్రసాద్ మాట్లాడుతూ, ప్రసాదరావు వద్ద శిష్యరికం చేయడం ద్వారా వేదగణితం, గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాలను చేయగలుగుతున్నామని తెలిపారు. అనంతరం ప్రసాదరావును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేలిక భూముల్లో పంటలకు చీడల బెడద అధికం

పాలసముద్రం : తేలిక భూముల్లో సాగు చేసిన చెరుకు పంటను చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని డీఆర్‌సీ–డీటీసీ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మని తెలిపారు. సోమవారం ఆమె మండలంలోని కృష్ణజమ్మపురం, పాలసముద్రం గ్రామాల్లో రైతులు సాగుచేసిన చెరుకు, వేరుశనగ పంటను ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ చెరుకు నాటినప్పటి నుంచి కోత వరకు పీక, కాండ తొలుచు పురుగులు పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. మొలక దశలో పీకపురుగు లోపలి భాగాలను తినడం వల్ల మొవ్వ ఎండిపోతుందన్నారు. నాటిన పంటను కార్సి(మమ్ము)తోటల్లో ఇది ఎక్కువగా ఆశిస్తుందని తెలిపారు. అందుకు లోతైన కాలువల్లో ముచ్చెలను, కణుపులను నాటాలని, నాటే ముందు ఎకరాకు 10 కిలోల మిథైల్ పెరాథియాన్ మందును లేదా 6 కిలోల ఫొరెట్ 10 గుళికలను వేయాలని సూచించారు. వీలైనంత తక్కువ వ్యవధిలో దగ్గరగా తడపాలని తెలిపారు. వ్యవసాయాధికారులు డిల్లీప్రసాద్, లక్ష్మీ, ప్రసన్న, సుధారాణి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వేపనపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం టి.వేపనపల్లి గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభోత్సవం చేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.7లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఈ ప్లాంట్‌ను ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులకు ఉచితంగా తాగునీటిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రవిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గోపిరెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వేణుగోపాలుని పవిత్రోత్సవం

- కార్వేటినగరంలో ప్రత్యేక హోమపూజలు
- రుక్మిణీ సత్యభామ సమేత స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలను టీటీడీ సిబ్బంది ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. పవిత్రోత్సవాల సందర్భంగా టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారికి పాలు, తేనె, పెరుగు, పసుపు, చందనం, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అర్చకులు వేదమంత్రాల నడుమ మేళతాలతో అంగరంగ వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట మధ్య వేద పండితులు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారికి పవిత్రాల సమర్పణ అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అగ్నిహోమం, ప్రతిష్ట నవకలశ స్థాపన, పవిత్ర ప్రతిష్ఠహోమం వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్ర సుగంధ భరితపుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు..

కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలున్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి నగర వీధుల్లో చెక్కభజనలు, కోలాటాలు, మేళతాళల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం 6 గంటల నుంచి 8 గంటల వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు ఆచార్య బహుమానాన్ని అందజేశారు. అనంతరం 9.45 గంటలకు స్వామివారిని ఏకాంతసేవలో పవళింపజేశారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు


పవిత్రాలను ఊరేగింపుగా తెస్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు